సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 4 । మే । 2024



.. ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

మారుమూల గ్రామాల్లో గిరిజనుల ఆరోగ్యంపై ఆరోగ్య కార్యకర్తలు దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. IIలో



అకాలవర్షంతో ఆందోళన

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. IIలో

గరిష్ఠం / కనిష్ఠం
42° / 28°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. మొదట అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆ తర్వాత పంచామృతాభిషేకం గావించి హారతి ఇచ్చారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. ఆ తర్వాత కుంకుమపూజ, గణపతి హోమం చేశారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు, వేద పండితులతో పాటు ఈఓ సుదర్శన్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: వేసవి సెలవుల్లో ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఫిజియోథెరపిస్టులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు దివ్యాంగులకు ప్రత్యేక సేవలు అందించేందుకు ఫిజియోథెరపీ డాక్టర్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలలో ప్రతీ వారం ఈ సేవలు అందుతాయని, పిల్లల తల్లిదండ్రులు గమనించాల ని కోరారు. సమావేశంలో సమ్మిళిత విద్య కో ఆర్డినేటర్ ఎస్‌కే సైదులు, ఫిజియోథెరపిస్ట్‌లు కనకనాగు, కిషోర్‌బాబు, వసీమ్, ప్రభాకర్‌రావు, శ్రీనివాసరావు, జ్యోతి, శ్రీదేవి పాల్గొన్నారు.

5,044 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 775 మంది రైతుల వద్ద రూ.11.02 కోట్ల విలువైన 5,044.640 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 99, జీసీసీ ద్వారా 27, డీఆర్‌డీఏ నుంచి 10.. మొత్తం 136 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. ఆయా కేంద్రాలలో మౌలిక సౌకర్యాలు కల్పించామని, రైతులు దళారుల ప్రలోభాలకు గురికాకుండా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. 17 శాతం కంటే ఎక్కువ తేమ ఉండకుండా చూడాలని కోరారు.

'గూడెం' ప్రచార సభలో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ముఖ్యమంత్రి అయ్యాక రెండోసారి జిల్లాకు..
- ఎన్నికల కోడ్‌కు ముందు భద్రాచలం, మణుగూరులో పర్యటన
- లోక్‌సభ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ నేడు కొత్తగూడెంలో సభ
- ప్రకాశం స్టేడియంలో పూర్తయిన ఏర్పాట్లు

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సిద్ధమైన సభావేదిక (ఇన్‌సెట్) ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యేలు



నేడు హస్తం శంఖారావం

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సాక్షిప్రతినిధి, ఖమ్మం: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం కొత్తగూడెం రానున్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్న జనజాతర సభలో సీఎం ప్రసంగించనున్నారు. ఇటీవల ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి భద్రాచలం, మణుగూరులో జరిగిన కార్యక్రమాలకు సీఎం హాజరయ్యారు. ఇప్పుడు రెండోసారి ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో ఉదయం 10.45 గంటలకు కొత్తగూడెం ప్రగతిమైదాన్‌కు చేరుకుని, 11 గంటలకు ప్రకాశం స్టేడియంలో జరిగే సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అభ్యర్థులు, ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొంటారు.

రెండింటినీ 'చే'జిక్కించుకునేలా..

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని భద్రాచలం మినహా ఎనిమిది స్థానాలను కాంగ్రెస్, ఒక స్థానాన్ని సీపీఐ గెలుచుకున్నాయి. భద్రాచలంలో బీఆర్‌ఎస్ గెలిచినా.. ఆ తర్వాత ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు ఖమ్మం పార్లమెంట్ పరిధిలో, మూడు నియోజకవర్గాలు మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. ఖమ్మం లోక్‌సభ పరిధి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్, ఒక చోట సీపీఐ ఎమ్మెల్యేలు ఉండగా.. పినపాక, ఇల్లెందుతోపాటు భద్రాచలం ఎమ్మెల్యే చేరికతో మహబూబాబాద్ పరిధిలోని మూడు స్థానాలు కూడా హస్తం ఖాతాలోనే ఉన్నాయి. ఇక లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. రెండింటికీ ఖమ్మం జిల్లా మంత్రులే ఇన్‌చార్జ్‌లుగా ఉండడంతో రెండు చోట్ల లోక్‌సభ ఎన్నికల్లోనూ హస్తం హవా కొనసాగించాలని కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంతో పనిచేస్తున్నాయి. కాగా, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ రెండు స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. కానీ ఈసారి ఎమ్మెల్యేల పరంగా రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలోనూ కాంగ్రెస్‌కు బలం ఉండటంతో గెలుపు తమదేనన్న ధీమా పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

కోడ్ రాకముందే ప్రచారం

ఎన్నికల కోడ్ రాకముందే సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో ప్రచార శంఖారావం పూరించారు. మార్చి 11న భద్రాచలంలో అధికారికంగా పర్యటించిన అనంతరం మణుగూరులో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాదీవెన సభకు హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనులకు పోడు హక్కు పత్రాలు, ఉమ్మడి జిల్లా అభివృద్ధి జరిగిందని, పార్లమెంట్‌కు పార్టీ అభ్యర్థులను పంపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని సీఎం పేర్కొన్నారు. అప్పటికే మహబూబాబాద్ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్‌ను ప్రకటించగా.. ఆ తర్వాత ఖమ్మం అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి ఖరారయ్యారు.

ఆఖరి మోఖా..

కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక కొత్తగూడెంలో శనివారం జరిగే సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. ఈ సభలో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునివ్వనుండగా.. అగ్రనేతల పరంగా ఇదే చివరి కార్యక్రమమని పార్టీ నేతలు చెబుతున్నారు.

సభకు ఏర్పాట్లు పూర్తి

కొత్తగూడెం రూరల్: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శనివారం జరగనున్న జనజాతర సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నారు. సభ కోసం ప్రకాశం స్టేడియంలో స్టేజీ, స్వాగత ద్వారాల నిర్మాణం, ఫ్లెక్సీల ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. దాదాపు 20 వేల మందికి సరిపడేలా కుర్చీలు, టెంట్లు ఏర్పాటు చేశారు. జర్మనీ టెంట్లతో వేదిక నిర్మించగా.. ఎండల తీవ్రత దృష్ట్యా దాదాపు 200 వరకు భారీ కూలర్లు తెప్పించారు. కాగా, సభ ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, రాందాస్‌నాయక్ పరిశీలించారు.

500 మంది పోలీసులతో బందోబస్తు

కొత్తగూడెం టౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం శనివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగే సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానుండగా భద్రతా ఏర్పాట్లపై పోలీసులు దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజ్ ఉద్యోగులతో కలిసి స్టేడియాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అలాగే, హెలీప్యాడ్ వద్ద కూడా పరిశీలించారు. ఏఎస్పీ టి.సాయిమనోహర్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ట్రెయినీ ఐపీఎస్ విక్రాంత్, సీఐలు కరుణాకర్, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

ముఖ్యమంత్రి పర్యటన, ప్రచార సభ సందర్భంగా కొత్తగూడెంలోని పలు మార్గాల్లో శనివారం వాహనాలను మళ్లించనున్నారు. పాల్వంచ వైపు నుంచి కొత్తగూడెం మీదుగా విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ఓల్డ్ డిపో రోడ్డు, భజనమందిర్ రోడ్డు, సింగరేణి హెడ్డాఫీస్ నుంచి రామవరం వైపుగా వెళ్లాల్సి ఉంటుంది. అలాగే, భద్రాచలం, పాల్వంచ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలను ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి టేకులపల్లి, ఇల్లెందు మీదుగా మళ్లిస్తారు. ఇక ఖమ్మం నుంచి కొత్తగూడెం మీదుగా పాల్వంచ వైపు వెళ్లే వాహనాలను విద్యానగర్ బైపాస్ రోడ్డు, సింగరేణి హెడ్డాఫీస్, మెయిన్ ఆస్పత్రి, భజన మందిర్ రోడ్డు, ఓల్డ్ డిపో రోడ్డు, మొర్రేడువాగు బ్రిడ్జి, ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి పాల్వంచ వైపు మళ్లించనున్నారు. అలాగే, విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలను సింగరేణి హెడ్డాఫీసు, భజనమందిర్ రోడ్డు, ఓల్డ్ డిపో రోడ్డు, మొర్రేడువాగు బ్రిడ్జి మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డుపైకి మళ్లిస్తారు.



భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

'పోస్టల్ బ్యాలెట్'ను వినియోగించుకోండి

ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ సూచన

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులంతా ఈనెల 6వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 4,696 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారి కోసం జిల్లాలో ఐదు ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. పినపాక నియోజకవర్గంలో మణుగూరు ఐకేపీ కార్యాలయం, ఇల్లెందుకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయం, కొత్తగూడెంలో ఆర్డీఓ కార్యాలయం, అశ్వారావుపేటలో వ్యవసాయ కళాశాల, భద్రాచలంలో ఆర్డీఓ కార్యాలయంలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటుహక్కును వినియోగించుకోవచ్చని వివరించారు.

ర్యాండమైజేషన్ పూర్తి..

జిల్లాకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి చేశామని ప్రియాంక ఆల తెలిపారు. కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాకు కేటాయించిన 1,931 బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్‌ను రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో పూర్తి చేశామని చెప్పారు. పినపాక నియోజకవర్గానికి 312, ఇల్లెందుకు 302, కొత్తగూడేనికి 632, అశ్వారావుపేటకు 460, భద్రాచలానికి 225 బ్యాలెట్ యూనిట్లు కేటాయించామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ మధు, తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల డీటీ రంగాప్రసాద్, నవీన్, కాంగ్రెస్, బీజేపీ, ఆప్ నాయకులు లక్ష్మణ్ అగర్వాల్, నోముల రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రండి

ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని కలెక్టర్ ప్రియాంక ఆల కోరారు. దాహం వేయకపోయినా వీలైనప్పుడల్లా తగినంత నీరు తాగాలని అన్నారు. పార్క్ చేసిన వాహనాల వద్ద పిల్లలను, పెంపుడు జంతువులను వదలి వెళ్లొద్దని హెచ్చరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

పర్ణశాల రామాలయంలో ఐపీఎస్ అధికారి

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారిని పంజాబ్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి చరణ్‌సింగ్ శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు స్వాగతం పలకగా, ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి, వాటి విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్‌ఐ గణేష్, సిబ్బంది ఉన్నారు.

హామీలపై ఆశలు..

- కాంగ్రెస్ మేనిఫెస్టోలో జిల్లా అంశాల ప్రస్తావన
- ఐదు గ్రామాల విలీనంపై స్పష్టమైన హామీ
- మణుగూరు – రామగుండం రైల్వేలైన్‌కు చోటు
- కొత్తగా సింగరేణి పారిశ్రామిక కారిడార్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో జిల్లాకు సంబంధించిన కీలక అంశాలకు చోటు దక్కింది. విలీన గ్రామాలు, సింగరేణి పారిశ్రామిక కారిడార్, మణుగూరు – రామగుండం రైల్వేలైన్, మైనింగ్ యూనివర్సిటీ వంటి కీలక అంశాలను మేనిఫెస్టోలో చేర్చడంతో జిల్లా వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో..

జిల్లాలో ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. ఈ నియోజకవర్గాలకు సంబంధించి పలు ముఖ్యమైన అంశాలను కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. రాష్ట్ర విభజన నాటి నుంచి భద్రాచలం పుణ్యక్షేత్ర అభివృద్ధికి ప్రధాన ఆటంకంగా మారిన స్థల లభ్యత సమస్యను కాంగ్రెస్ పార్టీ పరిగణనలోకి తీసుకుంది. ఏపీలో కలిసిన ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. పినపాక నియోజకవర్గానికి సంబంధించి మణుగూరు – రామగుండం రైల్వేలైన్ పనులు పూర్తి చేస్తామని పేర్కొంది. ఇల్లెందు నియోజకవర్గం విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం – 2014లో పేర్కొన్న విధంగా బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తామని ప్రకటించింది.

ఖమ్మం పార్లమెంట్ పరిధిలో..

ఖమ్మం పార్లమెంట్ పరిధిలో అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. దీంతో పారిశ్రామికరంగానికి సంబంధించిన పలు అంశాల్లో కొత్తగూడెం నియోజకవర్గం పరిగణనలోకి వచ్చే అవకాశం ఉంది. సింగరేణి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇది కార్యరూపం దాల్చితే ఇల్లెందు – టేకులపల్లి – కొత్తగూడెం – మణుగూరు – సత్తుపల్లి మధ్య పారిశ్రామీకరణకు మరింతగా అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుత మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఆచరణలోకి వస్తే.. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. 60 ఏళ్ల కిందటే కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ పేరుతో ఇక్కడ మైనింగ్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ అనేక సమస్యలు ఈ కాలేజీలో తిష్ట వేశాయి. ఈ కాలేజీని మైనింగ్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని ఇప్పటికే అనేక వినతులు రాష్ట్ర ప్రభుత్వానికి అందాయి. ఇప్పటి వరకు ఉమ్మడి ఖమ్మం లేదా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు యూనివర్సిటీ లేదు. ఈ నేపథ్యంలో మైనింగ్ యూనివర్సిటీ స్థాపన అంటూ జరిగితే కొత్తగూడేనికే అవకాశాలు ఎక్కువ. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం కొత్తగూడెం పర్యటనకు వస్తుండగా, ఒక రోజు ముందు ఈ మేనిఫెస్టో విడుదల కావడం తమకు లాభిస్తుందనే అంచనాలు కాంగ్రెస్ పార్టీలో నెలకొన్నాయి.


వీటికి చోటు దక్కలేదు..

తెలంగాణలోనే ఉద్యాన పంటలు ఎక్కువగా అశ్వారావుపేట నియోజకవర్గంలో విస్తరించి ఉన్నాయి. ప్రస్తుత మేనిఫెస్టోలో దీనికి సంబంధించి ఎలాంటి హామీ లభించలేదు. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కీలకమైన సీతారామ ప్రాజెక్టు అంశంపైనా మేనిఫెస్టోలో ఏమీ పేర్కొనలేదు. దీంతో పాటు భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి వేడుకలను రాష్ట్ర పండుగగా గుర్తించే అంశం, ప్రత్యేక నిధుల మంజూరు వంటివి మరుగున పడిపోయాయి. అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ఈ జిల్లాలో ప్రధానమైన పోడు భూముల సమస్య గురించి పైపైనే స్పృశించారు తప్పితే లోతుల్లోకి వెళ్లలేదనే అభిప్రాయం నెలకొంది.

పార్లమెంట్‌లో గళం వినిపిస్తా..

- కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు
- బీఆర్‌ఎస్‌తోనే అన్ని విధాలా అభివృద్ధి
- ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ

పాల్వంచ/దమ్మపేట/అశ్వారావుపేటరూరల్: వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజల తరఫున గళం వినిపిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు అన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి శుక్రవారం ఆయన పాల్వంచ, దమ్మపేట, అశ్వారావుపేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతోనే అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీల పేరుతో ప్రకటించిన మహాలక్ష్మి, రుణమాఫీ, రైతుబంధు పెంపు, తులం బంగారం తదితర పథకాల అములులో విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం దిశగా పరిపాలన కొనసాగించారని చెప్పారు. ధాన్యం కొనుగోలుపై పార్లమెంట్‌లో కేంద్రాన్ని తాను నిలదీస్తుంటే బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మాట కూడా మాట్లాడకుండా ఉండిపోయారని ఆరోపించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే విఫలమైందని విమర్శించారు. సీఎంతో పాటు మంత్రులు అమలు చేయలేని హామీలు గుప్పిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. రైతు భరోసా, పెన్షన్, మహిళలకు నెలకు రూ.2,500, తులం బంగారం ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ఓటడిగే హక్కు లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడగా అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, నాయకులు ఉప్పల వెంకటరమణ, కిలారు నాగేశ్వరరావు, మంతపురి రాజుగౌడ్, మల్లెల శ్రీరాంమూర్తి, మల్లెల రవిచంద్ర, పర్వతనేని రామకృష్ణ, వగ్గెల పూజ, సున్నం నాగమణి, భూక్యా ప్రసాద్, రావు జోగేశ్వరరావు, దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, దొడ్డా రమేష్, అబ్దుల్ జిన్నా, బత్తుల మధుచంద్, దాసరి నాగేశ్వరరావు, కాల్వ ప్రకాశ్, చందు నాయక్, సింధు తపస్వీ, మంజుల, కొత్వాల సత్యనారాయణ, ముత్యాల ప్రవీణ్, ముత్యాల రమణమూర్తి, పరిటాల సుబ్బారావు, వీరన్న, మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, జేకేవీ రమణారావు, సంపూర్ణ పాల్గొన్నారు. ఆనంద్, నామా నవీన్ పాల్గొన్నారు.



పాల్వంచలో మాట్లాడుతున్న నామ నాగేశ్వరరావు, పక్కన ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే వనమా

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి

ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా హనుమకొండకు చెందిన ఏనుగుల రాకేష్‌రెడ్డిని బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈమేరకు గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన రాకేష్‌రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. బిట్స్ పిలానిలో మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎంఎంఎస్), మాస్టర్స్ ఇన్ ఫైనాన్స్ (ఎంఎస్) పూర్తి చేసిన ఆయన సిటీ బ్యాంక్ మేనేజర్‌గా, జేపీ మోర్గాన్, ఫేస్‌బుక్‌లాంటి పలు అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీల్లో బెంగళూరు, అమెరికాలో ఏడేళ్ల పాటు ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు చేశారు. ఆపై రాజకీయాలపై ఆసక్తితో 2013లో బీజేపీ ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. అంచెలంచెలుగా ఎదుగుతూ బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, రెండు పర్యాయాలు రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. బీజేపీ నుంచి వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన రాకేష్‌రెడ్డి వరంగల్ కేంద్రంగా ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టారు. కానీ గత ఏడాది ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు యువత, విద్యావంతులతో మంచి సంబంధాలు ఉన్నాయని భావించిన కేసీఆర్.. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు.



రాకేష్‌రెడ్డి

నీట్‌కు ఏర్పాట్లు పూర్తి

- కొత్తగూడెం, పాల్వంచలో రెండు కేంద్రాలు
- హాజరు కానున్న 1,174 మంది
- సిటీ కో ఆర్డినేటర్ ఎం.వీ.ఎస్ రెడ్డి వెల్లడి

పాల్వంచ : దేశ వ్యాప్తంగా వివిధ వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించే 'నీట్'కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల సిటీ కో ఆర్డినేటర్ ఎం.వి.ఎస్.రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా జిల్లా నుంచి 1,174 మంది హాజరు కానున్నారని వెల్లడించారు. కొత్తగూడెంలోని సింగరేణి డిగ్రీ, పీజీ కళాశాల కేంద్రంలో 478 మంది, పాల్వంచ నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో 696 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఉదయం పరీక్ష 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు నీట్ అడ్మిట్ కార్డు, ఒరిజినల్ ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో తీసుకుని రావాలని, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాగ్‌లు లోనికి అనుమతించబోమని తెలిపారు. నిర్ణీత సమయం కంటే నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత ఉన్నందున విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఐదుగురి నామినేషన్లు

నల్లగొండ: నల్లగొండ – వరంగల్ – ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి శుక్రవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా మాధవపెద్ది వెంకట్‌రెడ్డి ఒక సెట్, చంద్రశేఖర్ రెండు సెట్లు నామినేషన్ పత్రాలను నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేశారు. అలాగే, అలియన్స్ డెమొక్రటిక్ రీఫామ్స్ పార్టీ అభ్యర్థి ఈద శేషగిరిరావు, తెలంగాణ సకల జనుల పార్టీ అభ్యర్థి నందిపాటి జానయ్య ఒక్కో సెట్ సమర్పించారు.



నామినేషన్ సమర్పిస్తున్న తీన్మార్ మల్లన్న, పక్కన మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు

క్లుప్తంగా

క్రీడల్లోనూ రాణించాలి

డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి



బాలబాలికలతో డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి తదితరులు

కొత్తగూడెంటౌన్: బాలబాలికలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి (డీవైఎస్‌ఓ) పి.పరంధామరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో త్రీఇంక్‌లైన్‌లోని తెలంగాణ క్రీడా మైదానంలో ఏర్పా టు చేసిన రెజ్లింగ్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి ఉచిత శిక్షణ శిబిరా లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ శిబిరంలో 50 మంది చిన్నారులు పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేసవి ఉచిత శిక్షణా శిబిరం ఇన్‌చార్జ్ పి.కాశీ హుస్సేన్, కోచ్ పి.నిహారిక, జిల్లా టైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇ.మొగిలి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఐ.ఆదినారాయణ, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, సీనియర్ కరాటే మాస్టర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమా చిత్రీకరణ

కొత్తగూడెంటౌన్: మార్కండేయా మూవీస్ పతాకంపై బొమ్మ హరిప్రసాద్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్ర సన్నివేశాలను శుక్రవారం కొత్తగూడెం పరిసరాల్లో చిత్రీకరించారు. షూటింగ్‌లో పాల్గొన్న బుల్లితెర నటుడు అప్పారావు మాట్లాడుతూ చేనేత కుటుంబానికి చెందిన ఓ యువకుడి కథాంశంతో సినిమా చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రేక్షకులకు నచ్చుతుందని పేర్కొన్నారు.

ఔషధాలు సీజ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో అధిక ధరలకు విక్రయిస్తున్న ఔషధాలను శుక్రవారం జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు సీజ్ చేశారు. పట్టణంలో తనిఖీలు చేపట్టిన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఓ మెడికల్ ఏజెన్సీలో అధిక ధరలకు టాబ్లెట్లను విక్రయిస్తున్నట్లు గుర్తించి, రూ.11 వేల విలువైన ఔషధాలను సీజ్ చేశారు. అధిక ధర ముద్రించినందుకు మందుల తయారీ కంపెనీపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు జి.ప్రసాద్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

74 మద్యం సీసాలు...

దమ్మపేట: అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ దుకాణంపై ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసుల బృందం శుక్రవారం దాడి చేశాయి. మండలంలోని నాయుడుపేట గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 70 మద్యం (90 ఎంఎల్) సీసాలు, నాలుగు క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నాయి. మద్యం సీసాలను సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎఫ్‌ఎస్ టీం అధికారి కృష్ణ, ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

ఓబీ వెలికితీతకు అంతరాయం

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీలో శుక్రవారం రాత్రి షిఫ్ట్‌లో ఓబీ వెలికితీతకు అంతరా యం ఏర్పడింది. జీతాల పెంపు విషయంలో మహాలక్ష్మి ఓబీ కంపెనీ యాజమాన్యానికి, కార్మికులకు మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో యూనియన్లతో సంబంధం లేకుండా చర్చలు జరపాలని కోరగా, దుర్భాషలాడటంతో కార్మికులు ఆవేదనకు గురై రాత్రి షిఫ్ట్‌లో ఓల్వోలు నడపకుండా విధులు బహిష్కరించారు. దీంతో ఓబీ వెలికితీతకు అంతరాయం ఏర్పడింది.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

పాల్వంచరూరల్: ఓ వ్యక్తిని హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం... మండల పరిధిలోని బంజర గ్రామపంచాయతీ చిరుతానిపాడు గ్రామానికి చెందిన పద్దం ఉంగయ్య అదృశ్యమైనట్లు గత నెల 29న కేసు నమోదైంది. కాగా నెల రోజులక్రితం ఉంగయ్య కొత్తూరు గ్రామానికి చెందిన ఉంగి అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి వరుసలు కలవలేదని కుల తప్పు కింద ఉంగయ్యకు రూ.1,50,000 జరిమానా విధించారు. దీంతో రూ.లక్ష 20 వేలు చెల్లించాడు. మిగతా రూ. 30 వేలు తర్వాత చెల్లిస్తానని ఒప్పుకుని తన భార్య ఉంగిని ఇంటికి తీసుకెళ్లాడు. ఉంగికి సోదరులయ్యే మాడవి ఎడమయ్య, అడమ, ముచకి ఐతలు గత నెల 26న ఉంగయ్య ఇంటికి వెళ్లి పంచాయితీలో ఒప్పుకున్న డబ్బులు ఇవ్వాలని అడిగారు. ఇప్పుడు తన వద్ద లేవని, తర్వాత ఇస్తామని బదులివ్వగా అక్కడి నుంచి ఉంగిని తీసుకెళ్లారు. అనంతరం ఉంగయ్య భార్య కోసం నడుచుకుంటూ వెళ్తుండగా ముగ్గురు కలిసి బండ్ల గుట్టపైకి తీసుకెళ్లి స్కార్ఫ్‌తో ఉరివేసి హత్య చేశారు. ఆత్మహత్యగా చిత్రీకరించి, అక్కడి నుంచి పారిపోయారు. కాగా ఎడమయ్య, ఐత శుక్రవారం పోలీసుల ఎదుట లొంగిపోయి నేరం ఒప్పుకున్నారు. దీంతో అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

అకాల వర్షంతో ఆందోళన

- పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వాన
- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- విరిగి పడిన చెట్లు, ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
- స్తంభాలు పడిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం
- చల్లబడిన వాతావరణంతో ప్రజలకు ఉపశమనం



అశ్వాపురం: మొండికుంట కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు

అశ్వాపురం/భద్రాచలంటౌన్: జిల్లాలో శుక్రవారం సాయంత్రం పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అశ్వాపురం మండలం తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలో రబీ సాగు వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మొండికుంట, మల్లెలమడుగు, రామచంద్రాపురం, నెల్లిపాకబంజర, బీజీకొత్తూరు, సీతరాంపురం, ఆనందాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కల్లాలు, ఖాళీ స్థలాల్లో రైతులు పెద్ద ఎత్తున ధాన్యం ఆరబోశారు. అకాల వర్షానికి రైతులు ఆవేదన చెందుతున్నారు. పరదాలు, టార్పాలిన్లు కప్పుతూ ఉరుకులు పరుగులు పెట్టారు. భద్రాచలంలో భారీ వడగళ్ల వాన కురిసింది. గాలి దుమారానికి చెట్లతోపాటు షాపుల బోర్డులు సైతం విరిగిపడ్డాయి. సుమారు రెండు గంటలపాటు వాన కురియడంతో వాతావరణం చల్లబడగా, వారం రోజులుగా అధిక ఎండలతో అల్లాడుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. చర్ల, కూనవరం రోడ్లలో చెట్లు విరిగి రహదారులపై పడగా, అధికారులు జేసీబీల సహాయంతో తొలగించారు. పలుచోట్ల చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో పట్టణంలో అంధకారం అలుముకుంది. కాగా, భద్రాచలం పట్టణంలో సాయంత్రం ఒకవైపు వర్షం పడుతుండగా మరో పక్క సూర్యుడు ప్రకాశవంతంగా కనిపించడం ప్రజలను ఆకట్టుకుంది.

ములకలపల్లిలో..

ములకలపల్లి: భారీ ఈదరుగాలులు వీయడంతో మాధారం, సీతాయిగూడెం ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. మాధారం అటవీ ప్రాంతంలో చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం కలిగింది.



వర్షం కురుస్తున్నా ప్రకాశవంతంగా కనిపిస్తున్న సూర్యుడు



చర్ల రోడ్‌లో విరిగి పడ్డ చెట్టు

తడిసిన ధాన్యం

పాల్వంచరూరల్: ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వానకు పాల్వంచ మండలం బండ్రుగొండ గ్రామంలో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. చేతికొచ్చిన ధాన్యం తడిసిపోయిందని రైతులు కంటే గోవర్ధన్, నిమ్మల నాగేంద్రబాబు, కంటే నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. దంతలబోరు ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీ సీతారాంపురం గ్రామంలో బలమైన గాలులకు 20 ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. నివాసాలపై చెట్లు కూలిపడ్డాయి. పైకప్పు ఎగిరిపోయి తీవ్ర నష్టం జరిగిందని గిరిజనులు మడవి దేవా, రవ్వ అంజని, ముచికి గంగా, వేట్టి సునీల్ పేర్కొన్నారు.



సీతారాంపురం గ్రామంలో ఎగిరిపడ్డ ఇంటి రేకులు

బీజేపీతోనే సుస్థిర పాలన

మానుకోట పార్లమెంట్ అభ్యర్థి సీతారాం నాయక్



దుమ్ముగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న అజ్మీరా సీతారాంనాయక్

దుమ్ముగూడెం/అశ్వాపురం/చర్ల రూరల్/మణుగూరు రూరల్: దేశంలో సుస్థిర పాలన కావాలంటే మోదీ నాయకత్వంలో బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ కోరారు. శుక్రవారం దుమ్ముగూడెం మండలంలోని గంగోలు గ్రామంలో జరిగిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో, చర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి తనను గెలిపించాలని కోరారు. కార్యకర్తలు మోదీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. చర్ల మండలంలోని సుమారు ఇరవై వేల ఎకరాలకు సాగునీరందించే వద్దిపేట చెక్‌డ్యాంను సాధిస్తామని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మిస్తామని, ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మణుగూరు పట్టణంలో, అశ్వాపురం మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీ నుంచి ఎస్‌కేటీ కల్యాణ మండపం వరకు ప్రచారం నిర్వహించారు. వ్యాపారులను, భారజల ఉద్యోగులను, ప్రజలను కలుస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓటు అభ్యర్థించారు. బీజేపీ నాయకులు కుంజా ధర్మా, సన్నె ఉదయ్ ప్రతాప్, గొలికోటి త్రినాథరావు, పసుమర్తి సతీష్, బిత్రగుంట క్రాంతి కుమార్, గునూరి రమణ, నల్లూరి ఉదయ్, పూర్ణ చంద్రరావు, తాటిపాముల అయిలయ్య, కల్లూరి రామారావు, కోలా భాస్కర్, కృష్ణవేణి, జంపన సీతారామరాజు, చిర్ర సరస్వతి, బాలరాజు, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, పున్నం భిక్షపతి, మహేష్ పాల్గొన్నారు.

మిత్రపక్ష పార్టీల కోఆర్డినేటర్లు వీరే...

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కోఆర్డినేటర్లను నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులను నియమించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు నాయకులు కేటాయించిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి తరఫున ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. పాలేరు నియోజకవర్గానికి మద్దినేని స్వర్ణకుమారి, బుగ్గవీటి సరళ, దండి సురేష్, ఖమ్మంకు మహ్మద్ జావీద్, ఎర్రా శ్రీకాంత్, జమ్ముల జితేందర్‌రెడ్డి, మధిరకు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పొన్నం వెంకటేశ్వర్లు, జమలేందర్‌రెడ్డి, వైరాకు రాంపూడి రోశయ్య, భూక్యా వీరభద్రం, యర్రా బాబు, సత్తుపల్లికి చల్లగుండ్ల నర్సింహారావు, మాచర్ల భారతి, దండు ఆదినారాయణ, కొత్తగూడెంకు నాగేంద్ర త్రివేది, అన్నవరపు సత్యనారాయణ, షేక్ సాబీర్ పాషా, అశ్వారావుపేటకు జూపల్లి రమేష్, కొక్కెరపాటి పుల్లయ్య, సయ్యద్ సలీంను నియమించామని వెల్లడించారు.

ఎమ్మెల్యే కనకయ్యకు మంత్రి పరామర్శ



ఎమ్మెల్యే కోరం కనకయ్యను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి పుల్లయ్య మృతదేహాన్ని శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి సంతాపం తెలిపారు. పుల్లయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, స్వగ్రామం కోయగూడెం వెళ్లి, ఎమ్మెల్యేను, ఆయన సోదరులను మంత్రి పరామర్శించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పొదెం వీరయ్య, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు పోరిక బలరాం నాయక్, మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మానుకోట జెడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు, మాజీ ఎమ్మెల్యేలు బాణోతు హరిప్రియ, గుమ్మడి నర్సయ్యతోపాటు రాయల చంద్రశేఖర్, సాధు రమేష్‌రెడ్డి, తుపాకుల ఎలగొండ స్వామి, పుచ్చకాయల వీరభద్రం , వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు మృతదేహాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అశ్రునయనాలతో పుల్ల య్య అంత్యక్రియలు పూర్తి చేశారు.

గిరిజనుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



ఆశ్రమ పాఠశాల సిబ్బందితో చర్చిస్తున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం/బూర్గంపాడు : మారుమూల గ్రామాల్లో నివసించే గిరిజనుల ఆరోగ్య స్థితిగతులను సామాజిక ఆరోగ్య కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. ఐటీడీఏలోని వైటీసీ భవన్‌లో ఆరోగ్య కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా హాజరైన పీఓ వారికి పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది వెళ్లలేని ప్రాంతాలలో ఆరోగ్యంపై స్థానికులను అప్రమత్తం చేసేందుకు చదువుకున్న యువతను గుర్తించి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గర్భిణులకు నిర్దేశిత సమయం ప్రకారం పరీక్షలు చేయాలని, హైరిస్క్ ఉన్న వారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. రక్తహీనతతో బాధ పడుతున్న చిన్నారులు పౌష్టికాహారం అందించేలా తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా గ్రామాల ప్రజలకు బీపీ, షుగర్, మలేరియా వంటి పరీక్షలు చేయాలన్నారు. ఆశ వర్కర్లతో సమన్వయంగా ఉండాలన్నారు. డీఎంహెచ్‌ఓ శిరీష మాట్లాడుతూ.. 104 మంది యువతకు శిక్షణ ఇచ్చామని, అందరికీ మెడికల్ కిట్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌ఓ భాస్కర్, డాక్టర్ సుకృత ,హెచ్‌ఈఓ దుర్గయ్య, స్వచ్ఛంద సంస్థ సభ్యులు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి..

ప్రతి ఉద్యోగికి రిటైర్‌మెంట్ అనేది తప్పనిసరని ప్రతీక్‌జైన్ అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన అసిస్టెంట్ అకౌంటెంట్ వీరశేఖరాన్ని శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఏఓ భీమ్, ఈఈ తానాజీ, ఏటూరునాగారం డీడీ పోచం, సెక్రటేరియట్ సిబ్బంది సత్యనారాయణ, చారి, గురుకులం ఆర్సీఓ వెంకటేశ్వర రాజు, ఎఫ్‌డీసీ అశోక్, ఏసిఎంఓ రమణయ్య, ఏటీడీఓ నరసింహారావు, డీటీఆర్‌ఓఎఫ్ఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడులు తెరిచే నాటికి వసతులు కల్పించాలి

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల పునఃప్రారంభం నాటికి అన్ని వసతులు సమకూర్చాలని ప్రతీక్ జైన్ ఆదేశించారు. బూర్గంపాడు మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్లాస్ రూమ్‌ల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి మరమ్మతులు చేపట్టాలని అన్నారు. హాస్టళ్లలో డార్మెటరీ, డైనింగ్ హాళ్లు, టాయిలెట్లు, బాత్‌రూమ్‌ల మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. సెలవుల్లో ఇంటికి వెళ్లిన విద్యార్థులు తిరిగి ఆశ్రమ పాఠశాలలకు వస్తే ఇంటిని తలపించేలా వసతులు ఉండాలని చెప్పారు. విద్యార్థులందరికీ బెడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తరగతి గదులు, ప్రహరీలకు వైట్ వాష్ వేయించాలన్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయాలని అన్నారు. పాఠశాలల్లో చేపడుతున్న పనులపై హెచ్‌ఎంలు దృష్టి సారించాలని అన్నారు. వసతి గృహాల్లో రెస్ట్‌రూమ్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాస్, హెచ్‌ఎంలు పద్మావతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవితఖైదు

కొత్తగూడెంటౌన్: భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు శుక్రవారం తీరు చెప్పారు. పాల్వంచ మసీదు గుట్టకు ప్రాంతానికి చెందిన దేవెళ్ల జ్యోతి కుమార్తె లావణ్య, ఇందిరానగర్‌కు చెందిన భూక్య విజయ్‌తో 2014లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కూతురు ప్రియాని జన్మించింది. కొంతకాలం తర్వాత విజయ్ తన భార్య లావణ్యను అనుమానంతో వేధించసాగాడు. వేధింపులు తట్టుకోలేక ఆలౌట్ తాగి ఆత్మహత్యకు కూడా యత్నించింది. ఈ క్రమంలో లావణ్య తన కూతురు, తల్లితో కలిసి పాల్వంచలోనే గాంధీనగర్‌లో వేరుగా ఉంటోంది. దీంతో అక్కడికి వచ్చి గొడవ పడి కూతురును తీసుకెళ్లాడు. దీంతో లావణ్య తల్లితోపాటు కల్లూరిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. 2019 జూలై 8న ఫోన్ చేసి కూతురు ప్రియానిని ఇస్తామని చెప్పడంతో తల్లీకూతుళ్లు పాల్వంచ వెళ్లగా, అక్కడి నుంచి పాపను ఇస్తానంటూ విజయ్ తన భార్యను తీసుకుని వెళ్లాడు. ఆరుగంటలైనా తిరిగి రాకపోవడంతో ఇందిరానగర్ కాలనీలోని ఇంటికి వెళ్లి చూడగా, లావణ్య మృతి చెంది ఉంది. దీంతో తన కూతురిని భర్తే హతమార్చాడని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పాల్వంచ టౌన్ పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. కోర్టులో 11 మంది సాక్షులు విచారించిన అనంతరం భూక్య విజయ్‌పై నేరం రుజువుకావడంతో సెక్షన్ 498ఏ ప్రకారం మూడేళ్ల జైలు, రూ.1000 జరిమానా, 302 సెక్షన్ ప్రకారం జీవితఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి ప్రాసిక్యూషన్ నిర్వహించగా, కోర్టు డ్యూటీ ఆఫీసర్ పీసీ గంగావత్ భాస్కర్, లైజన్ ఆఫీసర్ ఎస్.వీరబాబులు సహకరించారు.

వడదెబ్బతో ముగ్గురు మృతి

ఇల్లెందు/దుమ్ముగూడెం: జిల్లాలో శుక్రవారం వడదెబ్బతో ముగ్గురు మృతి చెందారు. దుమ్ముగూడెం మండలంలోని మహాదేవపురం గ్రామానికి చెందిన పాయం లక్ష్మయ్య (55) ఆవులను మేపేందుకు వెళ్లి ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురయ్యాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. అలాగే అడవిరామారం గ్రామానికి చెందిన సున్నం చిన్నక్క (50) వడదెబ్బకు గురికాగా భద్రాచలంలో చికిత్స చేయించినా ఫలితం లేక కన్నుమూసింది. కాగా, వడదెబ్బతో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. మహాదేవపురంలో పాయం లక్ష్మయ్య మృతదేహం వద్ద ఆయన నివాళులర్పించి మాట్లాడారు. నాయకులు మడకం రామారావు, దామెర్ల శ్రీనివాసరావు, రాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో వ్యాపారి...



శ్రీనివాసరావు (ఫైల్)

ఇల్లెందులో 30 ఏళ్లుగా ఎరువుల వ్యాపారం చేస్తున్న కాటేపల్లి శ్రీనివాసరావు(49) వడదెబ్బ బారిన పడి మృతి చెందాడు. గత పదిహేను రోజులుగా వ్యాపార నిమిత్తం గ్రామాల్లో పర్యటిస్తున్న ఆయన గురువారం వడదెబ్బకు గురయ్యాడు. దీంతో ఆస్పత్రిలో చేర్పించినా ఫలితం లేక ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. ఈమేరకు ఆయన మృతిపై సంతాపంగా వ్యాపారులు శుక్రవారం బంద్ పాటించారు. అలాగే, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగాల రాజేందర్ తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ యాకుబ్ అలీ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పేటమాలపల్లికి చెందిన ధార రాజశేఖర్(28) మద్యం మత్తులో గత నెల 30న భార్యతో గొడవపడ్డాడు. అనంతరం మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరి వెంకటలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

దమ్మపేటలో వృద్ధురాలు..

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధురాలు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం... చర్ల మండలం దానవాయిపేట గ్రామానికి చెందిన పోడియం మహేష్, మరో వ్యక్తితో కలిసి గురువారం సొంత ఊరు నుంచి దమ్మపేట వైపు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్లపెంట గ్రామంలో రోడ్డు దాటుతున్న ఊకే బుచ్చమ్మ(73)ను బైక్ ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు. కాగా ఈ ఘటనలో మహేష్‌కు స్వల్పగాయాలయ్యాయి.

ములకలపల్లిలో యువకుడు..

ములకలపల్లి: విద్యుదాఘాతానికి గురైన ఓ యువకుడు శుక్రవారం ప్రాణాలు వదిలాడు. మండలంలోని పలువురు యువకులు విద్యుత్ పనులు చేసేందుకు రెండు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన ఈసం లక్ష్మణ్ (25) గత మార్చి 31న పనులు చేస్తున్న క్రమంలో గాయపడ్డాడు. కిత్స పొందుతూ మృతిచెందాడు.

దుగినేపల్లిలో వ్యక్తి మృతి

కరకగూడెం: పినపాక మండలం దుగినేపల్లి శివారులో శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ వెంకటప్పయ్య కథనం ప్రకారం.. యర్రయ్య (60) అనే వ్యక్తి ఐదేళ్లుగా దుగినేపల్లిలో కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గ్రామశివారులో విగతజీవిగా పడి ఉండగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని మణుగూరు మార్చురీకి తరలించారు. బంధువులు, కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

మద్యం స్వాధీనం

పాల్వంచరూరల్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మద్యం విక్రయిస్తున్న దుకాణాలపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కోడిపుంజులవాగు గ్రామంలో మద్యం విక్రయిస్తున్న తేజావత్ శ్రీను ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. 20 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కిరాణా దుకాణంలో..

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని చిన్నంశెట్టి బజారులో నాగుబండి రామకృష్ణకు చెందిన కిరాణా దుకాణంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రూ. 11,341 విలువైన 39 మద్యం సీసాలను సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు.

రూ. 90 వేల నగదు సీజ్

అన్నపురెడ్డిపల్లి : యాతాలకుంట నుంచి చంద్రుగొండ వెళ్తున్న బొలెరో ట్రాలీ వాహనంలో ఆధారాలు లేకుండా రూ.90,800 నగదు తీసుకెళ్తుండగా మండలంలోని పెంట్లం చెక్‌పోస్ట్ వద్ద ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ వివరాలు వెల్లడించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



యశ్వంత్ (ఫైల్)

చంద్రుగొండ : ఉత్తీర్ణత సాధించలేదనే మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి ఒకరు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన రాజబోయిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా యశ్వంత్ (17) మొదటివాడు. కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ (ఎంపీసీ) చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో మ్యాథ్స్ సబ్జెక్ట్‌లో ఫెయిలవడంతో ముభావంగా ఉంటున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పరీక్షలు మళ్లీ రాయొచ్చని, బాధపడొద్దని సముదాయిస్తున్నారు. శుక్రవారం కుటుంబసభ్యులతో కలిసి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. ఎవరూ చూడని సమయంలో ఆ ప్రాంతంలోనే ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఎం.ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని తాపీమేస్త్రీ..

బూర్గంపాడు: సారపాకకు చెందిన ఓ తాపీమేస్త్రీ శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి గ్రామానికి చెందిన అమరజీవి(32) సారపాకకు చెందిన నాగమల్లేశ్వరిని ఐదేళ్ల క్రితం వివాహం చేసుకుని సారపాకలోనే కాపురం ఉంటున్నారు. తాపీ పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న ఈ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. ఇటీవల అమరజీవి మద్యానికి బానిసవటంతో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. గురువారం బాగా మద్యం తాగి వచ్చి ఓ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని పడుకున్నాడు. తెల్లవారి చూసేసరికి చీరతో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ SSC/ INTER FAIL??? Don't worry Pass from NIOS/OPEN BOARD (One Sitting) JOIN regular Degree Contact: 6301053911, 7989907461 [H-778911]

Real Estate

FLAT FOR SALE

■ ఖమ్మం, మమత హాస్పిటల్ వద్ద విలాసవంతమైన 3 బెడ్ రూమ్స్ తూర్పు ఫేసింగ్ ఫ్లాట్స్ అన్ని వసతులతో అమ్మబడును. బుకింగ్స్ ఓపెన్. చంద్రశేఖర్ డెవలపర్స్-90104 81234. [M-1233963]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185061]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని / వంటపనిచేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663 [H-799876]

WANTED TEACHERS

■ Admin Computer Faculty, Primary - All Subjects, High School - All Subjects, P.E.T., Wardens, డ్రైవర్స్, వంటమాస్టర్స్, ఆయాలు. Watsapp: 9553997127, 9849488973. [M-1233976]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ పేజీలో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9010299957, 9705444182
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642



ఎండలోనుంచి వచ్చిన వెంటనే చల్లటి నీళ్లు తాగుతున్నారా?

ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వెంటనే ఫ్రిడ్జ్ లోనుంచి బాటిల్ తీసుకుని చల్లని నీళ్లు గటగటా తాగడం చాలా మందికి అలవాటే. విపరీతమైన వేడిలో మన శరీరానికి రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీరు కొంత ఉపశమనం కలిగించేమాట నిజమే అయినా ఇలా చేయడం మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు.

ఎండలోనుంచి వచ్చిన వెంటనే చల్లటి నీళ్లు తాగడం వల్ల గొంతు నొప్పి, టాన్సిలైటిస్ సమస్య మాత్రమే కాదు.. జీర్ణక్రియ నుంచి రోగనిరోధక వ్యవస్థ వరకు... చివరకు గుండెపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది.

ఎందుకంటే రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని తాగడం వల్ల రక్తనాళాలు కుచించుకుపోతాయి. అదేవిధంగా ఆహారం తిన్న తర్వాత చల్లటి నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గిపోయి జీర్ణక్రియలో సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఘన ఆహారం సరిగా జీర్ణం కాదు. ఫలితంగా మలబద్ధకం వస్తుంది.

అంతేకాదు, చల్లటి నీటిని తాగడం వల్ల ఈ నాడి చల్లబడుతుంది. ఇది హృదయ స్పందన రేటును తగ్గిస్తుంది. గుండె కొట్టుకునే వేగం ఒక్కసారిగా తగ్గితే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.

రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని ఎక్కువగా తాగడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా శరీరంలో వివిధ రకాల సమస్యలు సంభవిస్తాయి. చల్లటి నీటిని తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు గట్టిపడుతుంది. ఇది బరువు పెరిగేందుకు దారితీస్తుంది.

అందువల్ల వీలయినంత వరకు ఎండలో నుంచి రాగానే చల్లటి నీళ్లు తాగకూడదు. అందులోనూ ఫ్రిజ్‌లోని నీళ్లు తాగడం అసలు మంచిది కాదు. కొంచెంసేపు ఆగిన తర్వాత కుండలోని నీళ్లు లేదా నార్మల్ వాటర్ ముందు తాగి, ఆ తర్వాత చల్లటి నీళ్లు తాగినా ఫరవాలేదు.

మీకు తెలుసా?

మెదడుకు పదును..!

బజారులో నడిచి వెళ్తున్నప్పుడు తెలిసిన వ్యక్తి ఎదురు పడితే వెంటనే పేరు గుర్తురాదు. పలకరింపుగా నవ్వి ఏదో ఒక రకంగా మేనేజ్ చేయాల్సి వస్తుంది. ఇలా తరచూ జరుగుతుంటే మెదడు బద్ధకంగా ఉంటోందని, మతిమరుపు పెరుగుతోందని జాగ్రత్త పడాల్సిందే. వార్ధక్య లక్షణాలను దూరంగా ఉంచడానికి దేహానికి వ్యాయామం చేసినట్లే మెదడు చురుగ్గా ఉండడానికి తగినంత వ్యాయామం కావాలి. రోజూ కనీసం ఒక్క పజిల్‌నైనా పరిష్కరించడం జ్ఞాపకశక్తిని మెరుగు పరుచుకోవడానికి మంచి మార్గం. అలా మెదడును కూడా చురుగ్గా ఉంచినప్పుడే మతిమరుపు అనే వార్ధక్య లక్షణం దూరమవుతుంది. రోజూ ఈ ప్రాక్టీస్ ఉంటే డెబ్బై ఏళ్లు నిండినా సరే జ్ఞాపకశక్తి తగ్గదు. మతిమరుపు దరిచేరదు. దరి చేర్చుకోకూడని మిత్రుడు మతిమరుపు, మెదడు వాడదాం... మెదడును 'వాడి'గా ఉంచుకుందాం.





చక్కెర తగ్గిస్తే కలిగే ప్రయోజనాలివి

చక్కెర ఉన్న పానీయాలు, స్వీట్లు, ఇతర పదార్థాలను తినడం మానేస్తే శరీరంలోకి అధికంగా చేరే కేలరీల పరిమాణం తగ్గుతుంది. దీని వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ● చక్కెరను దూరం పెట్టడం వల్ల హైబీపీ, గుండె జబ్బులు సహా ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ముప్పు తగ్గుతుంది ● నోటి ఆరోగ్యం, దంత సంరక్షణ కోసం చక్కెరను దూరం పెట్టడం చాలా మంచిది. చక్కెరతో కూడిన ఆహార పదార్థాలను దూరం పెడితే నోటి సమస్యలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది ● చక్కెర తినడం మానేయడం వల్ల టైప్–2 డయాబెటిస్ వచ్చే అవకాశం కూడా చాలా తగ్గుతుంది. మూడ్ స్వింగ్స్, చిరాకు, కోపం తగ్గుతుంది. చర్మం త్వరగా ముడతలు పడటం తగ్గి కాంతిమంతంగా మారుతుంది ● జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపుబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి.

లైఫ్@360

పిల్లల్లో... వ్యాధి నిరోధకత పెంచండిలా!

వేసవి సెలవలు ఇచ్చేశారు. పిల్లలందరూ ఇంటి దగ్గరే ఉంటారు. ఈ సమయంలోనే వారికి వ్యాధినిరోధక శక్తి అంటే ఇమ్యూనిటీ పెరిగే ఆహారాన్ని అందించడం వల్ల స్కూళ్లు తిరిగి తెరిచి, వర్షాలు పడినా కూడా చిన్నా చితకా వ్యాధులు రాకుండా ఉంటాయి. పిల్లలకు ఎలాంటి ఆహారం అందించాలో తెలుసుకుందాం...









సాధారణంగా పోషకాలన్నీ ఉన్న సమీకృత ఆహారం అందించడం వల్ల వ్యాధినిరోధకత పెరుగుతుంది. అందుకు ఏం చేయాలో చూద్దాం...

గుడ్డు: కోడిగుడ్డులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పిల్లలకు రోజూ ఒక ఉడికించిన గుడ్డు తినిపించాలి. కండరాలు, చర్మం, గుండె ఆరోగ్యానికి గుడ్డు మంచిది. పిల్లల ఎదుగుదలకు అవసరమైన విటమిన్ ఎ, బి2 (రైబోఫ్లేవిన్) కోడిగుడ్డులో లభిస్తాయి.

ఆకుకూరలు: ఆకుపచ్చటి ఆకుకూరలు, కొత్తిమీర, పాలకూర, ఈ సీజన్‌లో సమృద్ధిగా లభించే మునగకాడలు వంటివి తప్పనిసరిగా పెట్టాలి. వీటిలో ఫైబర్‌తోపాటు ఐరన్, జింక్, మినరల్స్ లభిస్తాయి.

పెరుగు, మజ్జిగ: పెరుగులో ప్రోబయోటిక్స్, విటమిన్ బి12 లభిస్తాయి. ఇది పొట్టలో చెడు బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా కాపాడుతుంది. ఇమ్యూనిటీని పెంచుతుంది. కాబట్టి పిల్లలు ఇష్టంగా తినేలా ఫ్రూట్ యోగర్ట్, వెజిటబుల్స్ రైతా, బూందీ రైతా రూపంలో ఇవ్వొచ్చు.

పసుపు: పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. పిల్లలకు రోజూ ఇచ్చే ఆహారంలో చిటికడు పసుపును చేర్చడం వల్ల ఆస్తమా, అలర్జీకి సంబంధించిన సమస్యలు దరిచేరకుండా ఉంటాయి. పాలల్లో పసుపు వేసి తాగించడం అలవాటు చేయవచ్చు.

బాదం, జీడిపప్పు, ఎండుద్రాక్ష, వాల్‌నట్స్, అప్రికాట్స్ వంటివి ఎక్కువగా తినిపించడం వల్ల మెదడు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు లభించడంతో పాటు పిల్లల్లో ఇమ్యూనిటీ పెరుగుతుంది.

ఇంకా సీజనల్ ఫ్రూట్స్ అయిన మామిడి, జామ, తాటిముంజలు, సపోటా వంటివి ఇవ్వాలి.

పిల్లలకు స్వీట్స్, పంచదార ఎక్కువగా ఉండే ఇతర పదార్థాలైన ఫ్రూట్‌జ్యూస్‌లు, చాక్లెట్స్, ప్యాకేజ్డ్ స్నాక్స్‌ను ఎక్కువగా తినిపించకూడదు. ఇవి ఇమ్యూనిటీని తగ్గిస్తాయి. ముఖ్యంగా పిల్లలు రోజూ తగినంత నిద్రపోయేలా చూడాలి. గంటసేపైనా బయట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఈ జాగ్రత్తలు పాటించడం మంచిది.

హెల్త్ టిప్స్



● కిస్మిస్‌లలో జింక్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు ఎంతగానో మేలు చేస్తాయి. రాత్రిపూట కొన్ని కిస్మిస్‌లను తిని గోరువెచ్చటి నీరు తాగితే మరుసటి రోజు ఉదయం విరేచనం సాఫీగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. దీంతో పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. అలా కాకపోతే రాత్రి పూట కిస్మిస్‌లను నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం కూడా తినవచ్చు. ఎలా తిన్నా సమస్య నుంచి బయట పడతారు.

● బాదంపప్పులో ప్రోటీన్లు, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ, కాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. అందువల్ల బాదంపప్పును రోజూ తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇందుకు గాను బాదంపప్పును రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే వాటిని పొట్టు తీసి తినాలి. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోవడంతోపాటు మలబద్ధకం తగ్గుతుంది. పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

● జామపండ్లలో విటమిన్లు, మినరల్స్ అనేకం ఉంటాయి. ఇవి దంతాలు, చిగుళ్ల సమస్యలు, జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. జామ పండ్లను తినడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మలబద్ధకం ఉండదు. అలాగే పైల్స్ కూడా తగ్గిపోతాయి. రోజూ రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రకు ముందు ఒక జామ పండును తింటే ఈ ప్రయోజనం కలుగుతుంది. దీంతో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

● రోజూ పరగడుపునే మూడు లేదా నాలుగు పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకుని పెనంపై వేసి వేయించి వాటిని అలాగే తినాలి. నేరుగా తినలేం అనుకుంటే తేనెతో కలిపి తీసుకోవచ్చు. దీని వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. మెటబాలిజం మెరుగు పడుతుంది. గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. అజీర్ణం నుంచి బయట పడతారు. మలబద్ధకం తగ్గి పైల్స్ నుంచి విముక్తి పొందవచ్చు.

● జీర్ణ సమస్యలను తగ్గించడంలో బెల్లం అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ రాత్రి భోజనం అనంతరం చిన్న బెల్లం ముక్కను చప్పరిస్తూ తినాలి. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మరుసటి రోజు సుఖ విరేచనం అవుతుంది. క్రమం తప్పకుండా రోజూ రాత్రి బెల్లం తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

సినిమా

కన్నప్పకి బై బై



● విష్ణు మంచు, అక్షయ్ కుమార్

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ 'కన్నప్ప'కి బై బై చెప్పారు. తన పాత్రకి సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేసిన ఆయనకి చిత్ర యూనిట్ వీడ్కోలు పలికింది. విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన షెడ్యూల్‌లో అక్షయ్ కుమార్ జాయిన్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా తన సీన్లకు సంబంధించిన షూట్‌ను ఆయన పూర్తి చేశారు. ''అక్షయ్ కుమార్‌గారి నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణం ఎంతో విలువైనది'' అని సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు విష్ణు మంచు. ''ధైర్యవంతుడైన యోధుడు, శివ భక్తుడైన కన్నప్ప కథతో ఈ చిత్రం అద్భుతంగా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది'' అన్నారు మేకర్స్.



● నయనతార

ముంబైలో వేట్టయాన్



● అమితాబ్ బచ్చన్ ● రజనీకాంత్

ముంబైలో అమితాబ్ బచ్చన్‌ను కలిశారు వేట్టయాన్. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా ఇతర లీడ్ రోల్స్‌లో దుషారా విజయన్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. తాజాగా 'వేట్టయాన్' చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన 'వేట్టయాన్' షూటింగ్ షెడ్యూల్‌లో రజనీ, అమితాబ్ కాంబినేషన్ సీన్స్ తీశారు. ఇప్పుడు ముంబైలో వీరిద్దరి కాంబినేషన్ సీన్స్‌ను తీస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్.

వినోదాల పతంగ్



● ప్రీతి పగడాల

ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించారు. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్‌పై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను డైరెక్టర్ బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సినిమా కాంటెస్ట్ విజేతలకు సిరిసిల్ల మాజీ ఎంపీ రాజయ్య బహుమతులు అందించారు. బుచ్చిబాబు సానా మాట్లాడుతూ– ''ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే 'హ్యాపీడేస్' సినిమాలా ఘన విజయం సాధిస్తుందనిపిస్తోంది'' అన్నారు. ''తొలిసారి పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్''' అన్నారు ప్రణీత్ ప్రత్తిపాటి. ''వేసవిలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు సంపత్ మక. ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల, వంశీ పూజిత్, క్రియేటివ్ నిర్మాత నాని బండ్రెడ్డి పాల్గొన్నారు.



● మెరిల్ స్ట్రీప్

ఈ పురస్కారం నాకో గౌరవం

హాలీవుడ్

ప్రముఖ నటి మెరిల్ స్ట్రీప్ ఆనందంలో ఉన్నారు. ఈ నెల 14 నుంచి 25 వరకు ఫ్రాన్స్‌లో 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ చలన చిత్రోత్సవాల్లో ప్రతిష్ఠాత్మకమైన పామ్ డి ఓర్ గౌరవ పురస్కారానికి మెరిల్ స్ట్రీప్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆమె ఆనందానికి కారణం ఇదే. ఈ ఏడాది మెరిల్ స్ట్రీప్‌కు, జపాన్‌కు చెందిన యానిమేషన్ 'స్టూడియో ఘిబ్లి' నిర్వాహకులకు, హాలీవుడ్ దర్శక–నిర్మాత జార్జ్ వాల్టన్ లూకాస్ జూనియర్ (స్టార్ వార్స్, ఇండియానా జోన్స్' ఫేమ్)కు పామ్ డి ఓర్ పురస్కారాన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా మెరిల్ స్ట్రీప్ మాట్లాడుతూ – ''ఈ అవార్డుకు ఎంపిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. అంతర్జాతీయ నటీనటులు, ఫిల్మ్ మేకర్స్ భాగాస్వామ్యులైన కాన్స్ వేదికగా నేను ఈ అవార్డును గెలుచుకోవడం అనేది ఫిల్మ్ మేకింగ్ రంగంలో నాకు దక్కిన ఓ అద్భుత విజయంగా భావిస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు. గతంలో హాలీవుడ్ స్టార్స్ టామ్ క్రూజ్, మైఖేల్ డగ్లస్, హారిసన్ ఫోర్డ్ వంటివారికి పామ్ డీ ఓర్ అవార్డు దక్కింది.

టాక్సిక్‌లో..?

యశ్

'టాక్సిక్' సినిమాలో నయనతార భాగం కానున్నారా? అంటే అవుననే టాక్ కన్నడ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'. మలయాళ నటి–దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ, శ్రుతిహాసన్ వంటి స్టార్స్ పేర్లు వినిపించాయి. అలాగే యశ్‌కు సోదరి పాత్రలో కరీనా కపూర్ నటిస్తారనే ప్రచారం జరిగింది. దీనికి తోడు తాను సౌత్ సినిమా అంగీకరించినట్లు ఆ మధ్య కరీనా స్వయంగా వెల్లడించారు. అది 'టాక్సిక్' సినిమానే అనే ప్రచారం సాగింది. అయితే తాజాగా షూటింగ్ కాల్షీట్స్ సర్దుబాటు చేయలేని కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి కరీనా కపూర్ తప్పుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్లేస్‌లో నయనతారను తీసుకోవాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. 2010లో ఉపేంద్ర నటించిన 'సూపర్' కన్నడలో నయనతారకు తొలి సినిమా. వార్తల్లో ఉన్న ప్రకారం నయనతార 'టాక్సిక్' సినిమా చేస్తే.. పద్నాలుగేళ్ల తర్వాత ఆమె కన్నడ సినిమా చేసినట్లవుతుంది.

లక్ష్మీ కటాక్షం ఫిక్స్



● 'లక్ష్మీ కటాక్షం' పోస్టర్

సాయికుమార్ లీడ్ రోల్‌లో సూర్య దర్శకత్వం వహించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం: ఫర్ ఓట్'. ఆమని, వినయ్, అరుణ్, దీప్తీ వర్మ, చరిష్మా శ్రీకర్, హరి ప్రసాద్, సాయికిరణ్ ఏడిద కీలక పాత్రల్లో నటించారు. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న రిలీజ్ కానుంది. ''పొలిటికల్ సెటైరికల్ డ్రామా, కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలో ఓటర్లే వారి ఓటుకు ఒక రేటు నిర్ణయించుకుని నాయకులని ముప్పు తిప్పలు పెట్టే సీన్లు ప్రేక్షకులను నవ్విస్తాయి'' అన్నారు మేకర్స్.

సూపర్ డీలక్స్...



● అషు రెడ్డి

'బిగ్ బాస్' ఫేమ్ అషు రెడ్డి, చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, జై భారత్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నవదీప్, పవన్ గోపరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో హారిక పాత్ర చేస్తున్న అషు రెడ్డి లుక్‌ను విడుదల చేశారు. ''మహిళా సాధికారతను చాటి చెప్పే నేపథ్యంలో 'యేవమ్' ఉంటుంది. నా బాడీ సూపర్ డీలక్స్ అని అషు రెడ్డి కిక్ ఇచ్చే పాత్రలో ఎందుకు కనిపించబోతున్నారో తెలియాలంటే 'యేవమ్' విడుదల వరకు ఆగాల్సిందే. కొత్త కథతో వైవిధ్యమైన నరేషన్‌తో ఈ సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.


ఎమోషనల్ సత్య

సమాజంలో తన వల్ల తన తల్లిదండ్రులకు ఏ మాత్రం ఇబ్బంది కలగకూడదని ఆలోచించే ఓ కొడుకు కథతో రూపొందిన చిత్రం 'సత్య'. హమరేశ్, ప్రార్థనా సందీప్ జంటగా నటించిన ఈ చిత్రానికి వాలీ మోహన్‌దాస్ దర్శకుడు. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా వాలి మాట్లాడుతూ– ''సత్య' సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. ఈ నెల 10న తెలుగు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో సినిమాను విడుదల చేయనున్నాం'' అన్నారు శివ మల్లాల.



● హమరేశ్, ప్రార్థన

1980లో ఏం జరిగింది?



● రాకేష్ వర్రె

'ఉయ్యాలా జంపాలా, మజ్ను' చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. రాకేష్ వర్రె హీరోగా నటించారు. వైశాలీ రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ఇతర పాత్రల్లో నటించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా విరించి వర్మ మాట్లాడుతూ– ''1980లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించాం. ప్రేమకథలు దర్శకత్వం వహించిన నేను 'జితేందర్ రెడ్డి' లాంటి యాక్షన్ మూవీ చేయడంతో క్రేజ్ నెలకొంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీఎస్ జ్ఞాన శేఖర్, సంగీతం: గోపీ సుందర్.

ఏమయ్యిందే...



● అశోక్ గల్లా, మానస

అశోక్ గల్లా, వారణాసి మానస జంటగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. 'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే తొలి పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సురేష్ గంగుల రాసిన ఈ పాటని ఈశ్వర్ దాతు పాడారు.